సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 27 । డిసెంబర్ । 2023



చలి చంపేస్తోంది'రొయ్యో'
చలి దెబ్బకు రొయ్యలను శీతాకాలపు వ్యాధులు చుట్టుముడుతున్నాయి. రొయ్యలకు సోకుతున్న వ్యాధులు, తెగుళ్లు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. 8లో



తొళక్కంపై ఊరేగిన శ్రీవారు
ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని ఉభయ దేవేరులు, గోదాదేవితో శ్రీవారు మంగళవారం క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. 8లో



రంగా పార్కుగా కొమ్మాయి చెరువు
తణుకు కొమ్మాయిచెరువు ప్రాంతంలో పార్కుకు రంగా పార్కుగా నామకరణం చేస్తానని మంత్రి కారుమూరి హామీ ఇచ్చారు. 8లో

న్యూస్‌రీల్

పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పసల



పసల కనక సుందరరావును అభినందిస్తున్న పాలకవర్గ సభ్యులు, అధికారులు

పెంటపాడు: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయ నూతన చైర్మన్‌గా పడమర విప్ప ర్రుకు చెందిన గూడెం మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందర్రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం పెంటపాడులోని కార్యాలయం వద్ద చైర్మన్ ఎన్నిక జరిగింది. జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ టి.గోవిందరాజు సమక్షంలో జరిగిన ఈ ఎన్నిక అనంతరం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మరో ఏడుగురు పాలకవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. పల్లెం అరుణకుమారి(సిద్దాపురం, ఆకివీడు మండలం), కాకులపాటి మల్లేశ్వరి (తోగుమ్మి, కొవ్వూరు), కురుసం బేబి(గార్లగొయ్యి, పోలవరం), గంటా సుమంత్‌కుమార్ (భీమవరం), మరీదు బాలస్వామి(భోగాపురం, పెదవేగి), షేక్ రహీం(సమిశ్రగూడెం, నిడదవోలు), గేదల సూర్యప్రకాష్‌రావు(పోణంగి, ఏలూరు)లు ఎన్నికయినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతి, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, వైఎస్సార్ పార్టీ నాయకులు బోణం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



పరీక్షల నిర్వహణపై అధికారుల సమావేశం

భీమవరం: ఏపీపీఎస్సీ నిర్వహించే డిపార్ట్‌మెంట్ పరీక్షలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ సీహెచ్ సాయిప్రకాష్ అధికారులకు తెలిపారు. మంగళవారం భీమవరం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబరులో పరీక్షల నిర్వహణపై పోలీస్, విద్యుత్, వైద్య శాఖ, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్స్, లైజన్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1,026 మంది పరీక్షలకు హాజరకానున్నారన్నారు. ఆబ్జెక్టివ్ టైప్‌లో నిర్వహించే పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం.3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని, కన్వెన్షనల్ టైపు పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు జరుగుతాయని వివరించారు.

అట్టహాసంగా ఆడుదాం ఆంధ్ర

- ఉమ్మడి పశ్చిమలో 47 రోజుల పాటు క్రీడా సంబరం
- రెండు జిల్లాల్లో 3 లక్షలకు పైగా రిజిస్ట్రేషన్లు
- తణుకులో ప్రారంభించిన మంత్రి కారుమూరి
- ఏలూరు, భీమవరంలో ప్రారంభించిన జిల్లా కలెక్టర్లు
- భీమవరంలో 2 కే రన్‌లో పాల్గొన్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు



తణుకు అర్బన్: ఆడుదాం ఆంధ్ర 2కె రన్‌లో మంత్రి కారుమూరి, చిత్రంలో ఎమ్మెల్సీ రవీంద్రనాథ్



బ్యాటింగ్ చేస్తున్న జేసీ రామసుందర్ రెడ్డి



భీమవరంలో బౌలింగ్ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి



భీమవరంలో 2కె రన్‌ను ప్రారంభిస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు



తణుకు అర్బన్: వాలీబాల్ ఆడి పోటీలు ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి



ఆకివీడు: బ్యాడ్మింటన్ ఆడుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అతిపెద్ద క్రీడా సంబరం 'ఆడుదాం ఆంధ్ర' మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. సంక్రాంతి పండుగకు 20 రోజులు ముందుగానే పల్లెల్లో క్రీడా సందడికి శ్రీకారం చుట్టారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ దశల్లో 47 రోజులు పాటు ఈ పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. గుంటూరు జిల్లాలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పోటీలను ప్రారంభించగా.. మంగళవారం ఉమ్మడి పశ్చిమలోని అన్ని నియోజకవర్గాల్లో లాంఛనంగా ప్రజాప్రతినిధులు హాజరై పోటీలను ప్రారంభించారు. తణుకులో పౌరసరఫరాల శాఖామంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఏలూరు, భీమవరంలలో కలెక్టర్లు వె.ప్రసన్న వెంకటేష్, పి.ప్రశాంతిలు ఈ పోటీలను ప్రారంభించగా మిగిలిన నియోజకవర్గాల్లో శాసనసభ్యులు ప్రారంభించారు.

గతంలో ఏ ప్రభుత్వం నిర్వహించని రీతిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు క్రీడలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి ఆడుదాం- ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖోల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతి క్రీడలో వందలాది జట్లు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పోటీ పడుతున్నారు. ఏలూరు జిల్లాలో 1.43 లక్షల మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 1.71 లక్షల మంది క్రీడల్లో పాల్గొనడానికి వీలుగా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఏలూరు జిల్లాలో 5 ప్రధాన క్రీడలకు సంబంధించి 14,354 టీంలను సిద్ధం చేసి 7,198 మ్యాచ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అత్యధికంగా క్రికెట్‌లో 2,730 టీంలు పాల్గొనుండటంతో 108 క్రీడాప్రాంగణాల్లో ప్రత్యేకంగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 535 సచివాలయాల పరిధిలో 223 క్రీడా ప్రాంగణాల్లో క్రీడా పోటీలకు మంగళవారం శ్రీకారం చుట్టారు.

పశ్చిమగోదావరి జిల్లాలో..

- తణుకు పట్టణంలో చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ 2 కె మారథాన్ నిర్వహించారు. కళాశాల ఆవరణలో పౌర సరఫరాల శాఖామంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ కార్యక్రమం క్రీడాకారుల ప్రతిభకు పట్టంకట్టే వేదిక అని, రాష్ట్ర వ్యాప్తంగా ఈ క్రీడోత్సవం క్రీడాకారులకు నూతన ఉత్తేజం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ పాల్గొన్నారు.
- నర్సాపురం వైఎన్ కళాశాలలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు ఘనంగా ప్రారంభించారు. నర్సాపురం ఆర్‌డీఓ ఎం.అచ్యుత అంబరీష్ పాల్గొన్నారు. వాలీబాల్, క్రికెట్ పోటీలను అతిథులు స్వయంగా ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు.
- భీమవరంలో 'ఆడుదాం ఆంధ్రా' 2కె రన్‌ను శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం లూథరన్ హైస్కూల్లో ఆడుదాం ఆంధ్ర పోటీలను కలెక్టర్ ప్రశాంతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రామసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉండి, ఆకివీడు మండలాల్లో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్లో వైఎస్సార్‌సీపీ యువనేత కొట్టు విశాల్, పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో నియోజకవర్గ సమన్వయకర్త గుడాల గోపి, ఆచంటలో పార్టీ నాయకులు 'ఆడుదాం-ఆంధ్ర' కార్యక్రమాలను ప్రారంభించారు.

ఏలూరు జిల్లాలో..

- ఏలూరులో అల్లూరి సీతారామరాజు స్టేడియంలో 'ఆడుదాం ఆంధ్ర' పోటీలను కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ బీ.లావణ్యవేణి, ఎస్పీ డీ.మేరి ప్రశాంతిలు విద్యార్థులతో కలిసి క్రీడల్లో పాల్గొన్నారు.
- కైకలూరు, కలిదిండి మండలాల్లో జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. నూజివీడులోని మీర్జాపురంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు పోటీలు ప్రారంభించి ప్రసంగించారు.
- బుట్టాయగూడెంలో జెడ్పీ పాఠశాలలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పోటీలు ప్రారంభించి సరదాగా క్రికెట్ ఆడారు. ఉంగుటూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు నియోజకవర్గంలోని నారాయణపురంలో ఉన్న ఎస్ఏఎస్ డిగ్రీ కళాశాల, గణపవరం కళాశాలలో పోటీలను ప్రారంభించారు. చింతలపూడి భాష్యం స్కూల్లో, జంగారెడ్డిగూడెంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పోటీలు ప్రారంభించి ప్రసంగించారు. దెందులూరు, పోతునూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పోటీలను ప్రారంభించారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు క్రీడలు దోహదం

భీమవరం: క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో దోహదం చేస్తాయని, అలాగే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. మంగళవారం భీమవరంలో 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం ప్రారంభం సందర్భంగా టూటౌన్ 35వ వార్డు ఆదర్శనగర్‌లోని అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహం వద్ద 2కె మారథన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. మారథాన్ జువ్వలపాలెం రోడ్డు మీదుగా అంబేడ్కర్ సెంటర్‌కు చేరుకుంది. కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ యు.రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వీరబాల దివస్

ఏలూరు(మెట్రో): ఏలూరు కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం వీరబాల దివస్ నిర్వహించారు. దీనిలో భాగంగా నిర్వహించిన డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి కేవీఎల్ పద్మావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి, శిశు గృహ మేనేజర్ కె.భార్గవి తదితరులు పాల్గొన్నారు.

కొత్త పంటలను ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో సాగు చేసే పంట రుణాల నిర్ధారణ, కొత్త పంటల ప్రోత్సాహానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మంగళవారం జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆధ్వర్యంలో వివిధ పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ధారణపై జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్, కలెక్టర్ పి. ప్రశాంతి అధ్యక్షతన నిర్వహ/ంచారు. డీఎల్‌టీసీలో సభ్యులుగా ఉన్న నాబార్డ్‌కు చెందిన ఎల్‌డీఎం, డీడీఎం, వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యానవన, మత్స్యశాఖల ప్రతినిధులు, వాణిజ్య బ్యాంకుల సమన్వయకర్తలు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, ప్రధాన స్వచ్ఛంద సంస్థలు, కొందరు ప్రగతిశీల రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సంబంధిత శాఖల నుంచి సాగు ఖర్చు, అన్ని పంటల దిగుబడికి సంబంధించిన సమాచారం కమిటీ పరిశీలన అనంతరం ఎకరాకు ఎంత రుణం మంజూరు చేయొచ్చో నిర్ధారిస్తామన్నారు. ఉద్యాన పంటలు, పశుసంవర్ధక కార్యకలాపాలు, మత్స్య పరిశ్రమలతో సహా అన్ని పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయిస్తారన్నారు. సాగు ఖర్చుల ప్రకారం, ప్రస్తుత స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌పై 10 నుంచి 20 శాతం నిర్ధారించారన్నారు. సమావేశంలో డీసీసీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.శ్రీదేవి, లోన్స్ అండ్ అడ్వాన్సెస్ మేనేజర్ ఎం.రమ్య, నరసాపురం ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, నాబార్డ్ డీడీ టి.అనిల్ కాంత్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్రప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి ఏ దుర్గేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంట సంక్షేమ వసంతం

- వివిధ పథకాల ద్వారా జిల్లాలో 17,36,330 మందికి రూ.1,933.21 కోట్ల లబ్ధి
- జగనన్న సురక్షతో ఉచితంగా 6,48,607 సర్టిఫికెట్ల జారీ
- సామాజిక సాధికార బస్సు యాత్రలకు జిల్లాలో అపూర్వ స్పందన
- వెల్లువలా తరలివచ్చిన జనం



జగనన్న సురక్షలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ (ఫైల్)



సాక్షి, భీమవరం: పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ ఏడాది సంక్షేమ క్యాలెండర్‌ను విజయవంతంగా అమలు చేసింది. చెప్పినట్టుగానే నిర్ణీత నెలల్లో ఆయా పథకాలను ప్రజలకు అందించారు. ఏడాది కాలంలో వివిధ పథకాల రూపంలో జిల్లాలోని 17,36,330 మందికి రూ.1,933.21 కోట్ల లబ్ధి చేకూరింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఈ ఏడాది జనవరిలో వైఎస్సార్ పెన్షన్ కానుక రూ. 2500 నుంచి రూ. 2,750కు పెంపు, రైతు భరోసా (మూడో విడత), వైఎస్సార్ ఆసరా, జగనన్న తోడు, ఫిబ్రవరిలో విద్యాదీవెన, జగనన్న చేదోడు, మార్చిలో వసతి దీవెన పథకాలను అమలుచేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్‌లో జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, మేలో వైఎస్సార్ రైతు భరోసా (మొదటి విడత), వైఎస్సార్ ఉచిత పంటల బీమా, మొదటి విడత జగనన్న విద్యాదీవెన(మొదటి విడత), వైఎస్సార్ కల్యాణమస్తు - షాదీతోఫా(మొదటి త్రైమాసికం), వైఎస్సార్ మత్స్యకార భరోసా, జూన్‌లో జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి, మొదటి విడత వైఎస్సార్ లా నేస్తం(మొదటి విడత), జూలైలో జగనన్న విదేశీ విద్యాదీవెన, వైఎస్సార్ నేతన్న నేస్తం, జగనన్న తోడు (మొదటి విడత), డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు, ఆగస్టులో జగనన్న విద్యాదీవెన (రెండో విడత), వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ వాహన మిత్ర, సెప్టెంబరులో వైఎస్సార్ చేయూత, అక్టోబరులో వైఎస్సార్ రైతు భరోసా(రెండో విడత), జగనన్న వసతి దీవెన(తొలి విడత), నవంబరులో వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు, వైఎస్సార్ కల్యాణమస్తు - షాదీతోఫా (మూడో త్రైమాసికం), డిసెంబరులో జగనన్న విదేశీ విద్యాదీవెన, జగనన్న చేదోడు పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. ఈ నెల 29న భీమవరం వేదికగా జగనన్న విద్యాదీవెన సాయాన్ని విడుదల చేయనున్నారు.

జగనన్న సురక్షతో చెంతకే సర్టిఫికెట్లు

జనన, మరణ, ఆదాయం, కులం తదితర ధ్రువీకరణ పత్రాల కోసం గతంలో పంచాయతీ, మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. అధికారులు ప్రజల వద్దకే వచ్చి ఆయా ధృవీకరణ పత్రాల జారీతో పాటు అర్హత ఉండి వివిధ కారణాలతో పథకాల లబ్ధిని పొందలేకపోతున్న వారిని గుర్తించి సమస్యను పరిష్కరించేందుకు జూన్‌లో నిర్వహించిన జగనన్న సురక్షకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమం ద్వారా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు, జిల్లాలోని 6.45 లక్షల కుటుంబాలను సర్వే చేసి వారి అవసరాలను గుర్తించారు. జూలై 1 నుంచి నెల రోజుల పాటు సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. జిల్లాలోని 6,05,780 మంది లబ్ధిదారులకు ఏ విధమైన సర్వీస్ చార్జీ లేకుండానే 6,48,607 సర్టిఫికెట్లు జారీ చేశారు. వీటిలో కుల ధృవీకరణ పత్రాలు 2,13,429 ఉండగా, ఆదాయ ధృవీకరణ పత్రాలు 2,09,816, ఆధార్‌కు ఫోన్‌నంబర్ అనుసంధాన సేవలు 11,551, కౌలు గుర్తింపు కార్డులు 61,937, మ్యుటేషన్ 250, మ్యారేజ్ సర్టిఫికెట్లు 93, జనన 486, మరణ 575, ఎఫ్ఎంసీ 422, రైస్ కార్డులు 2,847, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ విభజన 388, ఇతర సర్టిఫికెట్లు 1,46,813 ఉన్నాయి. ఎక్కడికి తిరగాల్సిన పనిలేకుండా, పైసా ఖర్చులేకుండా చెంతకే వచ్చి సర్టిఫికెట్లు జారీచేయడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

పథకం	లబ్ధిదారులు	అందించిన సాయం (రూ. కోట్లలో)
వైఎస్సార్ పెన్షన్ కానుక	2,33,087	741.72
వైఎస్సార్ ఆసరా	27,013 గ్రూపులు	276
స్త్రీనిధి	13,646 గ్రూపులు	97.76
జగనన్న తోడు	95,239	95.24
వైఎస్సార్ చేయూత	84,523	155.73
వైఎస్సార్ బీమా	6,109	89.59
వైఎస్సార్ పెళ్లికానుక	383	2.74
డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీ	31,682 గ్రూపులు	44.41
రైతు భరోసా	1,26,645	137.57
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	2,922	1.62
రైతులకు సున్నా వడ్డీరుణాలు	57,707	12
జగనన్న విద్యాదీవెన	42,827	101.81
అమ్మ ఒడి	1,43,534	21.05
జగనన్న వసతి దీవెన	42,197	38.88
జగనన్న విద్యాకానుక	1,13,584	26.12
విదేశీ విద్యాదీవెన	6	1.25
ఈబీసీ నేస్తం	13,460	20.19
వైఎస్సార్ కాపునేస్తం	34,642	51.96
వైఎస్సార్ మత్స్యకార భరోసా	1,635	1.63
వైఎస్సార్ నేతన్ననేస్తం	1,027	2.46
వైఎస్సార్ వాహనమిత్ర	13,201	13.2
వైఎస్సార్ లా నేస్తం	192 లక్షలు	57.60

సాధికార బస్సు యాత్రలకు బ్రహ్మరథం

అట్టడుగు వర్గాల వారిని పాలనలో భాగస్వాములను చేసిన సీఎం జగన్ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్రలకు జిల్లాలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇప్పటివరకు నర్సాపురం, పాలకొల్లు, తణుకు నియోజకవర్గాల్లో బస్సుయాత్రలకు ఆయా సామాజికవర్గాల ప్రజలు వెల్లువలా తరలివచ్చారు. శాసనమండలి చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి, ఎమ్మెల్సీ, శెట్టిబలిజ, వక్ఫ్‌బోర్డు, సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్లు, డీసీఎంఎస్ చైర్మన్, టీటీడీ మెంబర్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీసెల్ ప్రెసిడెంట్, మహిళ కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్లు తదితర కీలక పదవులను జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులకు ఇచ్చి సామాజిక సాధికారత చేసి చూపించిన తీరును కొనియాడారు.



తణుకులో సామాజిక సాధికారయాత్రకు తరలివచ్చిన జనసందోహం(ఫైల్)

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో చిన్న పొరపాటుకు కూడా ఆస్కారం లేకుండా పగడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ నెల 29న ముఖ్యమంత్రి భీమవరం పర్యటన నేపథ్యంలో మంగళవారం స్థానిక బైపాస్ రోడ్డులోని గ్రంధి వెంకటేశ్వర రావు ప్రభుత్వ జూనియరు కాలేజీ వెనుక లేఅవుట్‌లో సభావేదిక, పార్కింగ్ ప్లేస్, లూథరన్ హైస్కూలులో హెలీప్యాడ్‌ను ఎస్పీ రవి ప్రకాష్, జేసీ ఎస్.రామ సుందర్ రెడ్డి కలిసి కలెక్టరు పరిశీలించారు. సభాస్థలి, ముఖ్యమంత్రి బస్సు, కాన్వాయ్, మంత్రులు, శాసన సభ్యుల వాహనాల రాక, పార్కింగ్ వంటివి పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా దీవెన పథకం నిధులను భీమవరం నుంచి బటన్ నొక్కి ప్రారంభిస్తారని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే నేరుగా తనతో మాట్లాడాలన్నారు. సుమారు 25 వేలకు పైగా ప్రజలు కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉందని, సుమారు 700 బస్సులు పార్కింగ్ చేసేందుకు ప్రదేశాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆర్డీవో కె.శ్రీనివాసులు రాజు, ఈపీడీసీఎల్ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్, జిల్లా ఆర్ అండ్ బీ అధికారి బి.లోకేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ అధికారి డా.ఆర్పీ ఆనంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ యువ నేత

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి కారుమూరి



తణుకులో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ యువ నేత సురేంద్రతో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు పట్టణ టీడీపీ తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు, ఏలూరు జిల్లా ప్రైవేటు ఐటీఐ కళాశాలల అసోసియేషన్ సహాయక కార్యదర్శి యడ్లపల్లి సురేంద్ర రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసిన సురేంద్రకు మంత్రి కారుమూరి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సురేంద్ర టీడీపీ సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ బసవ రామకృష్ణ అల్లుడు కావడం విశేషం. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ టీడీపీ అనుసరిస్తున్న విధానాలపై టీడీపీ వర్గీయులు విసుగు చెందడంతోపాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనకు ముగ్ధులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని అన్నారు. సురేంద్రతో పాటు తేతలి గ్రామానికి చెందిన యువకుడు దొమ్మేటి శివ కూడా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ తణుకు పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, అత్తిలి మండల అధ్యక్షులు పైబోయిన సత్యనారాయణ, తణుకు మండల అధ్యక్షులు బోడపాటి వీర్రాజు, రామిశెట్టి రాము పాల్గొన్నారు.

28న డయల్ యువర్ డీఎం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అందజేసే సేవలపై ఈ నెల 29వ తేదీ న నిర్వహించే డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో సలహాలు, సూచనలు, ఫిర్యాదులు తెయజేయాలని తాడేపల్లిగూడెం డీపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి మంగళవారం తెలిపారు. ప్రయాణీకులు, ప్రజలు 99592 25488 నంబర్‌కు ఫోన్ చేయాలని డీఎం విజ్ఞప్తి చేశారు.

చలి చంపేస్తోంది'రొయ్యో'

- శీతాకాలం రొయ్య సాగుకు గడ్డుకాలం
- వణికిస్తున్న వైట్ స్పాట్, వైట్ గట్ తెగుళ్లు
- పడిపోతున్న కనీస ఉష్ణోగ్రతలు
- ఉమ్మడి జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో సాగు



కైకలూరులోని ఓ రొయ్యల చెరువులో ఏరియేటర్లు తిప్పుతున్న దృశ్యం



రొయ్యలు

కైకలూరు: చలి పంజాకు రొయ్యల రైతులు విలవిల్లాడుతున్నారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రొయ్యల చెరువులలో 29 నుంచి 39 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండాలి. రాత్రి సమయంలో 18 డిగ్రీల కంటే ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఈ ప్రభావం రొయ్యల పరిశ్రమపై పడుతోంది. మరో వైపు శీతాకాలపు వ్యాధులు చుట్టుముడుతున్నాయి. రొయ్యల ధరలను పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా రొయ్యలకు సోకుతున్న వ్యాధులు, తెగుళ్లు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చలి తీవ్రత మరింత పెరిగే అవకాశాలు ఉండటంతో ఆక్వా రైతులు బెంబేలెత్తిపోతున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. ఏటా దాదాపు రూ.38 వేల కోట్ల ఆదాయం రొయ్యల సాగు ద్వారా సమకూరుతోంది. శీతాకాలంలో రొయ్యల్లో బ్యాక్టీరియా లోడ్ పెరగడంతో పాటు తెల్లమచ్చల వ్యాధి, వైట్‌గట్, విబ్రియోసిస్, రన్నింగ్ మెర్టాలటి సింద్రోమ్ (ఆర్ఎంఎస్), డబ్ల్యూఎస్ఎస్‌వీ, పాకుడు, మొప్ప వ్యాధులు అధికంగా వస్తున్నాయి. ప్రధానంగా సీడ్ (రొయ్య పిల్ల) కొనుగోలు సమయంలో నాణ్యమైన పిల్లను ఎంపిక చేసుకోపోవడంతో సమస్య మరింత ఉధృతంగా మారుతోంది. ఈ పరిస్థితిపై కైకలూరు ఆక్వా ల్యాబ్ ఏడీ బి.రాజ్‌కుమార్, కాకినాడకు చెందిన విశ్రాంత మత్స్యశాఖ అధికారి రామ్మోహనరావు రొయ్యల రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- శీతాకాలంలో నీటి ఉష్ణోగ్రత బాగా పడిపోవడం వల్ల రొయ్యల్లో ఆకలి, ఫీడ్ తీసుకునే శక్తి, జీర్ణశక్తి తగ్గుతుంది
- సరైన ఫీడింగ్ షెడ్యూల్ కోసం చెక్ ట్రేలను పర్యవేక్షించాలి
- అధిక, తక్కువగా ఫీడ్ ఇవ్వరాదు. ఫీడ్ చార్టును ఆధారంగా తీసుకోవాలి.
- రైతులు నీటి పీహెచ్‌లో రోజువారి వైవిధ్యాన్ని కూడా తనిఖీ చేయాలి. ఉదయం, సాయంత్రం సమయంలో పీహెచ్‌లు వ్యత్యాసం 0.5 కంటే ఎక్కువగా ఉండకూడదు
- వ్యాధి నివారణ చికిత్స కోసం రసాయనాలు, ప్రొబయోటిక్స్ సిద్ధంగా ఉంచుకోవాలి.
- చెరువు బయో సెక్యూరిటీని మెరుగుపరచాలి

తక్కువ పెరుగుదల సమస్య..

- శీతాకాలంలో తక్కువ ఉష్ణోగ్రత వల్ల జంతువుల వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది
- వైట్‌స్పాట్ వైరస్‌లు వ్యాప్తి వేసవి కంటే శీతాకాలంలో ఎక్కువగా ఉంటుంది. తక్కువ ఉష్ణోగ్రత వల్ల వ్యాధికారక ఉధృతి ఎక్కువ.
- రొయ్యలు శరీర ఉష్ణోగ్రత నీటి ఉష్ణోగ్రత మారుతూ ఉంటుంది. శరీర ఉష్ణోగ్రతను పరిసరాలకు సర్దుబాటు చేయడానికి ఇది ఫీడ్ నుంచి శక్తిని వినియోగిస్తుంది. అందువల్ల పెరుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

ఫీడ్‌లో బూజు, ఫంగస్ సమస్య...

- అధిక తేమ కారణంగా చలికాలంలో మేతలో బూజు వంటి శిలీంధ్రాలు ఏర్పడే అవకాశాలు ఎక్కువ
- రొయ్యలు హెపాటోపాంక్రియాస్ వంటి హాని కలిగించే కొన్ని శిలీంధ్రాలను ద్వారా మైకోటాక్సిన్స్ ఏర్పడి హాని కలిగిస్తాయి
- బూజులు ఏర్పడకుండా ఉండేందుకు మేత శుభ్రంగా, పొడి ప్రదేశాల్లో నిల్వ చేయాలి

ఇతర చర్యలు..

- స్టాకింగ్ సాంద్రతను తగ్గించాలి. ఇది చెరువులో ఒత్తిడిని తగ్గిస్తోంది
- సాగు అంతటా మంచినీటి శుద్ధి, చెరువు శుద్ధి, రొయ్యల సంరక్షణ ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- 1.5 మీటర్లు అంతకంటే ఎక్కువ నీటి లోతులు నిర్వహించండి. మేఘావృతమైన రోజుల్లో ఏరియేటర్ల రన్నింగ్ సమయాన్ని పెంచాలి
- ఉష్ణోగ్రత ఆకస్మాత్తుగా పడిపోయినప్పుడు ఫీడ్‌ని ఆపేయండి. అవసరమైతే తగ్గించాలి
- రొయ్యలు ఆరోగ్యం, పెరుగుదల స్థితిని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి
- ఫీడ్‌లో విటమిన్ 'సీ', బి కాంప్లెక్స్ డైజెస్టివ్ ఎంజైమ్‌లను ఉపయోగించాలి

నాణ్యమైన సీడ్ అందించాలి



శీతాకాలంలో వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ముఖ్యంగా ఈహెచ్‌పీ, వైట్ గట్, విబ్రోయో, వైట్ స్పాట్ వంటి వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. హెచరీలలో తల్లి విత్తనం నుంచి సరైన నాణ్యమైన సీడ్ రాకపోవడం కూడా కారణంగా మారుతోంది. ఆక్వా రైతులకు ప్రభుత్వం నాణ్యమైన సీడ్‌ను పంపిణీ చేయడంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలి.

– ముంగర నరసింహారావు, రొయ్యల రైతు, ఆకివీడు

ఎక్కువ లోతులో నీటిని నింపండి



ఎక్కువ లోతులో నీటిని చెరువుల్లో నింపాలి. దీని వల్ల త్వరగా నీటి ఉష్ణోగ్రత తగ్గదు. సీడ్(రొయ్య పిల్ల) కొనుగోలులో నాణ్యమైన పిల్లలను ఎంపిక చేసుకోవాలి. పగటిపూట ఏరియేటర్లను ఎక్కువగా తిప్పాలి. రొయ్యల్లో రంగు, మొప్పలు, అన్నవాహిక, నల్లటి, తెల్లటి చుక్కలు, రొయ్య కవచం వదులు వంటి మార్పులను గమనించాలి. ప్రభుత్వ ఆక్వా ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకోవాలి.

– బి.రాజ్‌కుమార్, ప్రభుత్వ ఆక్వా ల్యాబ్ ఏడీ, కైకలూరు

ఓటీపీ వెల్లడితో సైబర్ నేరాల ముప్పు



మాట్లాడుతున్న సీఐలు నాగరాజు, ఆంజనేయులు

తణుకు అర్బన్: టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు తమ వ్యక్తిగత సమాచారం బహిర్గతం చేసే విధంగా మొబైల్స్ వచ్చే ఓటీపీలు అడుగుతున్నారనే ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో కొంతమందిని బైండోవర్ చేసినట్లు తణుకు పట్టణ సీఐ ఎం.నాగరాజు, తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు చెప్పారు. తణుకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఓటీపీ నంబర్ ఇతరులకు వెల్లడించడం ద్వారా సైబర్ నేరాలు జరిగే ముప్పు ఉంటుందన్నారు. ప్రజల వ్యక్తిగత సమాచారం తెలిపే ఓటీపీ వ్యవహారం సైబర్ నేరంగా పరిగణించబడుతుందని, తద్వారా ప్రజలు ఆర్థికంగా, సమాచారపరంగా మోసపోయే పరిస్థితి ఎదురవుతుందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇప్పటికే మైక్ ద్వారా ప్రచారం చేయిస్తున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు సమావేశాలు నిర్వహించుకునేందుకు, ర్యాలీలు చేసుకునేందుకు పోలీసు శాఖ అనుమతులు ఇస్తుందని, కానీ ప్రజలకు ఇబ్బంది కలగకుండా వారే చూసుకోవాల్సి ఉంటుందన్నారు. కానీ ఇటీవల టీడీపీకి చెందిన కొందరు తమను ఓటీపీ నంబర్లు చెప్పాలని అడుగుతున్నారని పట్టణ పరిధి నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీనిపై ఓటీపీలు అడిగిన వారిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. ప్రజలెవరైనా ఓటీపీ చెప్పి మోసపోయామని ఫిర్యాదులు వస్తే బాధ్యులపై ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ ప్రకారం చీటింగ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఓటీపీల వ్యవహారంలో సైబర్ నేరగాళ్లు వీరిని ఫాలో అయితే బ్యాంకు ఖాతాల్లో డబ్బు దొంగిలించే అవకాశం కూడా ఉన్నట్లుగా గుర్తుచేశారు. ఓటీపీ అడగడం కూడా నేరంగానే పరిగణిస్తామని, ఓటీపీలు అడిగి ప్రజలను ఇబ్బందిపెట్టవద్దని సీఐలు సూచించారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా ఉండాలి



ఎన్నికల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటర్ల జాబితా నూరు శాతం స్వచ్ఛత ఎంత ముఖ్యమో, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడం కూడా అంతే ముఖ్యమని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. మంగళవారం స్థానిక వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్, ఆర్డీఓలు, ఈఆర్వోలు, ఎన్నికల అధికారులతో సమావేశమై ఓటర్ల జాబితా సవరణ, తదితర ఎన్నికల విషయాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024 ప్రక్రియ పారదర్శకంగా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జనవరి 5న తుది జాబితా వెలువడనున్నందున ఇంత వరకు అందిన దరఖాస్తులను ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా వెంటనే పరిష్కరించాలన్నారు. ఎస్ఎస్ఆర్–2024, ఎన్నికల సన్నద్ధతకు సంబంధించి ప్రతి దశలోనూ సమస్యను సరైన విధంగా గుర్తించడం, విశ్లేషించడం, పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా, విజయవంతంగా ఎలాంటి అవరోధాలు లేకుడా పూర్తిచేసేందుకు సమగ్ర, పటిష్ట ఎన్నికల నిర్వహణ ప్రణళిక అవసరమన్నారు. ఇందుకు ప్రతి ఒక్క అధికారి కృషి చేయాన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలపై దృష్టి సారించాలన్నారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిపిషేషన్ (స్వీప్) కార్యక్రమాలు చేపట్టాలని, స్వీప్ కార్యక్రమాలు క్రియాశీలంగా ఉండేలా చూడాలన్నారు. ఇందుకు విస్తృతంగా స్వీప్ యాక్టివిటీని నిర్వహించాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునేలా, ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించి, ప్రోత్సహించడం ప్రధానమని పేర్కొన్నారు. నియోజకవర్గాలు, బూత్ స్థాయిలో గతంలో నమోదైన పోలింగ్ శాతాలను పరిశీలించి తక్కువగా ఉన్నచోట అందుకు కారణాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి పోలింగ్ శాతం పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో కళాశాలలు, పారిశ్రామిక కమ్యూనిటీల్లో అవగాహన కల్పించడం ద్వారా పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. జన జాగృతికి వీలుకల్పించే ప్రచార సామగ్రిని పిక్టోరల్ ఫార్మాట్‌లో అందించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలతో మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారులు కె.శ్రీనివాసులు రాజు, యం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, వివిధ నియోజకవర్గాల ఈఆర్వోలు, ఎన్నికల సెక్షన్ తహసీల్దార్ వై.దుర్గ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి ఊరేగింపు



రథంపై విశేష అలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి



నగరంలో స్వామి వారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న స్వామివారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్వామివారి ఊరేగింపు నగరంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అధిష్టింపచేశారు. వేదమంత్రోచ్చారణల నడుమ నీరాజనాలు సమర్పించారు. పలు వీధుల్లో కొనసాగిన గ్రామోత్సవాన్ని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ధర్మకర్తలు, వివిధ భజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు పర్యవేక్షించారు.

తొళక్క వాహనంపై ఊరేగిన శ్రీవారు



క్షేత్రంలో తొళక్క వాహనంపై ఉభయ దేవేరులు, గోదాదేవితో ఊరేగుతున్న శ్రీవారు

ద్వారకాతిరుమల: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని ఉభయ దేవేరులు, గోదాదేవితో శ్రీవారు మంగళవారం క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ఈ వేడుక భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం హారతులిచ్చారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గజ సేవల నడుమ శ్రీవారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. గ్రామోత్సవం అనంతరం ఆలయ ప్రధాన కూడలిలోని ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవికి అర్చకులు విశేష పూజలు జరిపి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

వ్యాపారిపై దుండగుల దాడి

నగదు బ్యాగ్, మోటారుసైకిల్ అపహరణ

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ఒక వ్యాపారిపై దుండగులు సోమవారం రాత్రి దాడి చేసి నగదు బ్యాగ్, మోటారుసైకిల్‌ను అపహరించారు. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు వన్‌టౌన్ దక్షిణపువీధికి చెందిన విడియాల రామాంజనేయులు ఎలక్ట్రికల్ హోల్‌సేల్ వ్యాపారం చేస్తుంటాడు. నగరంలోని ఆయా ఎలక్ట్రికల్ షాపులకు పరికరాలు సరఫరా చేస్తూ రాత్రివేళ నగదును వసూలు చేస్తారు. ఇదే క్రమంలో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో నగదును వసూలు చేసుకుని ఇంటికి వెళుతుండగా ఇంటి సమీపంలో రాజుగారి మేడ వద్ద గుర్తు తెలియని దుండగులు ఆకస్మికంగా తలపై రాడ్డులతో దాడి చేసి రామాంజనేయులు వద్ద ఉన్న నగదు బ్యాగ్, మోటారుసైకిల్‌ను అపహరించి పరారయ్యారు. కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని అతన్ని నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తీసుకువెళ్లారు. భార్య గంగాభవాని ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంగా పార్కుగా కొమ్మాయి చెరువు

- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ



తణుకు కొమ్మాయిచెర్వు ప్రాంతంలో రంగా విగ్రహావిష్కరణ అనంతరం రంగా అభిమానులతో మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, కాపుల ఆరాధ్య దైవం వంగవీటి మోహనరంగా అందరివాడిగా అందరికీ సేవ చేశారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. వంగవీటి మోహనరంగా 35వ వర్ధంతి సందర్భంగా తణుకు కొమ్మాయిచెర్వు ప్రాంతంలో కాపు సంఘ నాయకులు ఏర్పాటు చేసుకున్న రంగా విగ్రహాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కొమ్మాయి చెరువు ప్రాంత కాపు వర్గీయులు కోరిన వెంటనే రంగా విగ్రహం పెట్టుకునేందుకు అనుమతులు ఇప్పించానని, రంగా వంటి మంచి మనిషి విగ్రహాన్ని పెట్టేందుకు తాను ఎప్పుడూ సిద్ధమేనని చెప్పారు. అంతేకాకుండా సొసైటీ రోడ్డును వంగవీటి మోహనరంగా వీధిగా మార్చామని, ఇప్పుడు కొమ్మాయిచెరువు ప్రాంతంలో అభివృద్ధి చేస్తున్న పార్కు పనులు పూర్తయిన తరువాత రంగా పార్కుగా నామకరణం చేయిస్తానని హామీ ఇచ్చారు. రంగా హత్య ఎలా జరిగింది, ఎవరు చేశారనే విషయం అందరికీ తెలిసిన విషయమేనని ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ సత్తా కృష్ణవేణి, విగ్రహ దాతలు యాదగిరి పెద్దరాజు, యాదగిరి చిన్నరాజు, నాయకులు దున్నాల ఉమామహేశ్వరరావు, దేవిశెట్టి నారాయణ, మల్లుల సత్యనారాయణ, దుడే శ్రీనివాస్, బోయిడి అన్నవరం, కొఠారు రామాంజనేయులు పాల్గొన్నారు.

వంగవీటికి నివాళి

వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా వంగవీటి మోహన రంగా వీధిలోని రంగా విగ్రహానికి మంత్రి కారుమూరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ కార్మికులకు రంగా వెన్నుదన్నుగా నిలిచి వారి సమస్యలపై పోరాటాలు చేశారని గుర్తు చేశారు. తణుకు కాపు సంక్షేమ సంఘ అధ్యక్షులు వంటిద్దు ఈశ్వరప్రసాద్, నియోజకవర్గ కాపు సంఘ కన్వీనర్ అడ్డాల అనంతబాబు, మాదిరెడ్డి బాబూజీరావు, గాజుల కాశీ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరి నాట్లపై సల్ఫేడ్ ఉధృతి



పెదతాడేపల్లి గ్రామంలో వరి నాట్లను పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: వరి నాట్లపై సల్ఫేడ్ ఉధృతి కనిపిస్తుందని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో వరి నాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ మొదటి దమ్ముకు నాట్లు వేసే సమయానికి సుమారు 13 నుంచి 15 రోజుల వ్యవధి ఉండాలని, అది లేకపోవడం వల్ల వరి దుబ్బులు సరిగా కుళ్లకపోవడం వల్ల సల్ఫేడ్ ఉధృతి వస్తుందన్నారు. సల్ఫేట్ కలిగిన ఎరువులను అధికంగా వాడటం వల్ల సల్ఫేడ్ ప్రభావం వస్తుందన్నారు. సల్ఫర్ ఎరువులను ఎక్కువ మోతాదులో వాడొద్దని హితవు పలికారు. నాట్లు వేసిన 15 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ లేదా క్లోరోఫైరిపాస్ 1.5 ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. గుళికలు వేసుకోవాలని సూచించారు. తద్వారా పురుగును నివారించవచ్చన్నారు. ఆర్బీకే అసిస్టెంట్ పాలూరి అలేఖ్య, రైతులు చిట్టూరి సుబ్బారావు, పసుమర్తి సత్యనారాయణ, జి.మురళీకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో మంగళవారం నిరుపేదలకు నిత్యావసర వస్తువులు, రెండు బియ్యం బస్తాలు అందజేశారు. లయన్స్‌క్లబ్ సీనియర్ నాయకులు, మాజీ అధ్యక్షుడు, దాత పదం కుమార్ గుప్తా రీజియన్ అధ్యక్షుడు మదన్‌మోహన అగర్వాల్‌లకు సత్కారాలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వంగపండు రామ మోహన్ రావు, సెక్రటరీ చిన్నం జగదీష్, ట్రెజరర్ జీడిగంట హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

డైమండ్స్ వారిచే.....

డైమండ్స్ ఆధ్వర్యంలో జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య వారిచే లార్డ్స్ ఆఫ్ లైఫ్‌లో స్నాక్స్, ఎనర్జీ డ్రింక్స్ పంపిణీ చేశారు.

కొత్తూరులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



కొత్తూరులో డిజిటల్ కార్డులను అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొత్తూరు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్ రామగాని సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. ముద్ర యోజన, అన్నపూర్ణ అన్నయోజన, విశ్వకర్మ యోజన ఉన్నా యన్నారు. ప్రజలు ఈ పథకాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, బీజేపీ నాయకులు బండి శ్రీనివాస్, చిక్కాల శ్రీనివాస్, రెడ్డి బుల్లిరాజు, మద్దుకూరి రామారావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాసవి ఆలయంలో విశేష పూజలు



వాసవి మాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మార్గశిర మాసం పౌర్ణమి సందర్భంగా మంగళవారం వాసవి అమ్మవారి మూల విరాట్‌కు పంచామృతాలతో సుగంధ ద్రవ్యాలు, ఫలారసాలతో విశేష అభిషేకాలు జరిగాయి. అమ్మవారికి రజిత చీరతో అలంకరించారు. ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, లక్ష్మీనారాయణ స్వామిలకు విశేష పూజలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం కోశాధికారి నున్న బాల త్రిపుర సుందరరావు, ఆలయ సెక్రటరీ పేరూరి కాశయ్యలు పర్యవేక్షించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

శ్రీకృష్ణ మందిరంలో...

దత్త జయంతి సందర్భంగా కృష్ణ యోగ ధ్యాన మందిరంలో మంగళవారం ధనుర్మాస పూజలు, చింతామణిదేవి అమ్మవారికి అభిషేకాలు, దత్తాత్రేయ స్వామికి అష్టోత్తర శత నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆడుదాం ఆంధ్రతో క్రీడాకారుల ప్రతిభకు పట్టం

- గ్రామీణ ప్రాంతాల్లోని ఆణిముత్యాలను వెలికితీసేందుకే
- 47 రోజులపాటు క్రీడోత్సవం
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకు అర్బన్: ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో 2కే రన్‌లో పాల్గొన్న మంత్రి కారుమూరి, తదితరులు



తాడేపల్లిగూడెం అర్బన్: ఆడుదాం ఆంధ్ర ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్

తణుకు అర్బన్ : 'ఆడుదాం ఆంధ్ర' క్రీడాకారుల ప్రతిభకు పట్టం కట్టే వేదిక అని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను మంత్రి కారుమూరి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ కార్యక్రమం ప్రవేశపెట్టినా దాని తాలూకా ఫలితాలను అందరికి చేరేలా చేస్తారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవం క్రీడాకారుల్లో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తుందని, వచ్చేనెల 10 తేదీ వరకు 47 రోజులపాటు నిర్విరామంగా నిర్వహించే ఈ క్రీడాపోటీల్లో పట్టణం, గ్రామీణ క్రీడాకారులు తమ ప్రతిభా పాటవాలను చూపించనున్నారని స్పష్టం చేశారు. ఒకే ఈవెంట్ ద్వారా 5 విభాగాల్లో మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోటీలు నిర్వహించడం చరిత్రాత్మకమన్నారు.ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు లోనుకాకుండా క్రీడలపట్ల ఆసక్తి చూపించి తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. ముందుగా ఆడుదాం ఆంధ్ర క్రీడలకు సంబంధించి మంత్రి కారుమూరి ప్రతిజ్ఞ చేయించి, వివిధ క్రీడలను ఆయన స్వయంగా ఆడి ప్రారంభించారు. అనంతరం 2కే రన్‌ను మంత్రి కారుమూరి ప్రారంభించి క్రీడాజ్యోతితో రన్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు పీఎన్‌డీ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ములగాల శ్రీనివాస్, పిల్లి సూర్యారావు, పుల్లెపు సూర్యచంద్రరావు, వై.రామకృష్ణ, ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ నాయకులు ప్రగతి రాజా, అపుస్మా నాయకులు బి.విద్యాకాంత్, తణుకు నియోజకవర్గ పరిశీలకులు జక్కంశెట్టి సత్యరాజేంద్రప్రసాద్, కత్తుల జెస్‌పాల్, ఉమ్మిడి సింగ్ శ్రీనివాస్, జిలాని, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మార్పు కోసం క్రీడల నిర్వహణ

తాడేపల్లిగూడెం రూరల్: విద్యార్థులు మార్కులకు ఇస్తున్న విలువ క్రీడలకు ఇవ్వడంలేదని, విద్యార్థుల ఆలోచన విధానంలో మార్పు తీసుకొచ్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలు నిర్వహిస్తున్నారని తాడేపల్లిగూడెం ఆర్డీవో కే.చెన్నయ్య అన్నారు. మండలంలోని పెదతాడేపల్లి సచివాలయం-1, 2 పరిధిలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో భాగంగా వాలీబాల్ పోటీలను ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆర్డీవో చెన్నయ్య మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడుతూ భారతం నుంచి క్రీడలకు ప్రాధాన్యత ఉండేదన్నారు. ఎంపీపీ పానుకుమాటి శేషులత, ఎంఈవో-2 పీఎం కే.జ్యోతి, పెదతాడేపల్లి సొసైటీ చైర్మన్ పరిమి తులసీదాస్, హెచ్ఎం ఎస్‌కే.లాల్ బీబీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, పీఈటీ అనుచూరి నాగార్జునరావు, సచివాలయ కార్యదర్శి రవిచంద్ర, సొసైటీ చైర్మన్ జడ్డు హరిబాబు, నాయకులు ఆలపాటి కాశీవిశ్వేశ్వరరావు, పరిమి మునీంద్ర, రేలంగి సత్యనారాయణ, కట్టా ఏసు, భోగెళ్ళ రాంబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. మండలంలోని ఆరుగొలను, కొమ్ముగూడెం, కడియద్ద, జగన్నాథపురం తదితర గ్రామాల్లో మంగళవారం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను ప్రారంభించారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, వెలిశెట్టి నరేంద్రకుమార్, ఎమ్పీటీసీలు జంపెల్లి సత్యవతి, నార్ని రవికాంత నాగేశ్వరరావు, సర్పంచ్‌లు రాజమహేంద్రవరపు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పెంటపాడు: మండలంలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పెంటపాడులో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, ఎంపీపీ దాసరి హైమావతిలు పెంటపాడు ప్రభుత్వ బేసిక్ పాఠశాలలో మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందన్నారు. గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ఈ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా పెంటపాడు బేసిక్ పాఠశాల నుంచి మారథాన్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో సీహెచ్ బాలాజీ, ఎంఇఒ టీవీ రామక్రిష్ణ, ఈవోపీఆర్డీ ప్రసాద్, కార్యదర్శులు రామక్రిష్ణ, కెవి రామారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు దాసరి ప్రవీణ, వ్యవసాయసలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన క్రిష్ణప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, పార్టీ గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, సచివాలయ కన్వీనర్ మైలవరపు పెదబాబు,చల్లా లింగమూర్తి, మద్దె క్రిష్ణమూర్తి, వైస్ ఎంపీపీ కొణతాల, సర్పంచ్‌లు, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

అత్తిలి: క్రీడల ద్వారా శారీరక, మానసిక ప్రశాంతత చేకూరుతుందని యువ నాయకుడు కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మంగళవారం అత్తిలి డిగ్రీ కళాశాల ప్రాంగణంనుంచి 3కె రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జడ్పీకోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఎంపీడీవో అమీలుజమా, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీయడానికే ఆడుదాం ఆంధ్ర

తణుకు టౌన్: గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించి, వారిని ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతోనే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టినట్లు రాష్ట్ర పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వేల్పూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు చుంద్రు శ్యామల, తాడిపర్తి సుజాత, మండల ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో కె కిరణ్‌కుమార్, ఎంఈవో మురళీ సత్యనారాయణ, హెచ్ఎం మునీంద్ర, గ్రామ కార్యదర్శి గంగాధరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండపాకలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, పరిమి ప్రసాదు, కడలి శ్రీరాములు, సబ్బవరపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. క్రీడలతో మంచి ఆరోగ్యం సాధ్యమని ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు అన్నారు. ఈసందర్భంగా వాలీబాల్, క్రికెట్, ఖోఖో, క్రికెట్ పోటీలను ప్రజా ప్రతినిధులు లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె శ్రీనివాస్, ఎంపీటీసీ ఎం రామానాయుడు, పాలా పాలేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎ శ్రీనివాస్, స్టేట్ సేవాదళ్ కన్వీనర్ వెంకటరాయుడు, వైస్ ఎంపీపీ నాగ వెంకట సత్యనారాయణ, పోతుల సోమేశ్వరరావు, జవ్వాది హరిబాబు, పిల్లి శ్రీనివాస్, మెరుపే బుజ్జి, మెరుపే నాగేశ్వరరావు, నిమ్మల నాని, జవ్వాది దుర్గారావు, జవ్వాది సురేష్, ఏసుబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలి

తాడేపల్లిగూడెం అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని తాడేపల్లిగూడెం పట్టణంలో విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కర్రి విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం ప్రారంభించారు. తొలుత తాలూకా ఆఫీసు సెంటరు నుంచి ఆడుదాం ఆంధ్ర ర్యాలీని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు నిర్వహించారు. ఆణిముత్యాలు వంటి క్రీడాకారులను తయారు చేయడానికే 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని వైఎస్సార్ సీపీ నాయకులు, పట్టణ కన్వీనర్ కర్రి భాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంఈ మురళీకృష్ణ, ఏఎస్ఓ సురేష్, నాయకులు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, తాతా శ్రీనివాస్, వట్టి బుజ్జి, బోణం విజయనిర్మల, దింటకుర్తి లీలావతి, పత్సమట్ల సావిత్రి, పత్తి రజని, చికిన ప్రసాద్, చెన్నా జనార్ధన్, ఆర్ట్ అకాడమీ డైరెక్టర్ మానికొండ వెంకటేశ్వరరావు, తెన్నేటి జగ్జీవన్, తాళ్ళూరి మురళీ, ఆకుల ధనశేఖర్, కోడే శ్రీనువాస్, మద్దుల ప్రసాద్, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



అత్తిలి: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 3కే రన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యువనేత కారుమూరి సునీల్‌కుమార్



తణుకు టౌన్: కబడ్డీ ఆడుతున్న మహిళలు



తాడేపల్లిగూడెం రూరల్: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్



తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఆర్డీవో కే.చెన్నయ్య



పెంటపాడు: మారథాన్ యాత్రలో పాల్గొన్న ఎంపీపీ తదితరులు

సంక్షేమ సారథి మళ్లీ రావాలి

- ఇంటింటికీ సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



పైడిపర్రులోని 33వ వార్డు సచివాలయం వద్ద మాట్లాడుతున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: కరోనా కష్ట కాలంలో కూడా సంక్షేమ పథకాలతో పాటు రూ. 55 వేల కోట్ల విలువైన 31 లక్షల ఇళ్ల పట్టాలను అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అవసరమని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం సాయంత్రం తణుకు పట్టణంలోని 33వ వార్డు సచివాలయం పైడిపర్రులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని తెలిపారు. ఒక్క పైడిపర్రులోని 33వ సచివాలయంలోనే రూ. 35 కోట్ల 5 లక్షల విలువైన అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ నాయకులు ఓట్లు అడగకుండా ఓటీపీలు అడిగి ఓట్లను మాయం చేస్తున్నారని, దానితో పాటు బ్యాంక్‌లో సొమ్ములను కూడా కాజేసేస్తున్నారని ప్రజలకు అటువంటి వారిపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డును ఆయన ఆవిష్కరించారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, వైస్ చైర్మన్ వివశంకర్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఇండుగపల్లి బలరామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మంగెన సూర్య, మహిళా అధ్యక్షురాలు నూకల కనకదుర్గ, నాయకులు ములగాల శ్రీను, చరణ్, దుర్గా ప్రసాద్, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనను బేరీజ్ వేసుకుని, సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు కొట్టు విశాల్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు విశాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా పని చేస్తుందన్నారు. ప్రతీ సంక్షేమ పథకాన్ని సచివాలయాల వద్ద ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఇంత పారదర్శకంగా పనిచేసిన ప్రభుత్వాలు లేవన్నారు. జగన్ అందిస్తున్న సంక్షేమాన్ని గుర్తించి రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో జగన్‌ను, నియోజకవర్గంలో కొట్టు సత్యనారాయణను గెలిపించాలని కోరారు. అనంతరం సచివాలయం వద్ద సంక్షేమ బ్యానర్‌ను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, సొసైటీ చైర్మన్లు చిక్కాల సత్యనారాయణ, వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, ఎమ్పీటీసీ నార్ని శంకరరావు, ఆకుల ధనశేఖర్, తిరుమల శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ గార్లపాటి వీరకుమారి, సచివాలయ కార్యదర్శి ఉప్పు విజయలక్ష్మి, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

28న ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు: ఈనెల 28న గురువారం అలంపురం వెంకటరమణ సేవా ఆసుపత్రికి ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ట్రస్టు ప్రతినిధి కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ సర్జన్, వైద్యులతో పాటు, ప్రత్యేకంగా కార్డియాలజీ, గైనకాలజీ, అంకాలజీ వైద్యనిపుణులు రానున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిబిరంలో 2డి ఈకో, ఎక్స్‌రే, ఈసీజీ, స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభించబోయే ఈ శిబిరానికి రేషన్, ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులతో పాటు, పాత రిపోర్టులు తప్పక తీసుకొని రావాలన్నారు. రాజమండ్రి రాజానగరంకు చెందిన జీఎస్ఎల్ కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

తణుకు: ఆర్థిక అసమానతలు, అణచివేత లేని దోపిడీ రహిత సమాజ సమాజ స్థాపన ధ్యేయంగా సీపీఐ 99 ఏళ్లుగా నిర్విరామంగా ఉద్యమిస్తూ ప్రజల కోసం ప్రాణాలర్పించిన చరిత్ర భారత కమ్యూనిస్ట్ పార్టీదని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. మంగళవారం తణుకులోని సురాజ్య భవన్ వద్ద సీపీఐ తణుకు పట్టణ సమితి ఆధ్వర్యంలో సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత భీమారావు సీపీఐ పతాకాన్ని ఆవిష్కరించారు.

రంగా సేవలు చిరస్మరణీయం



జగన్నాథపురంలో వంగవీటి మోహన రంగ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సర్పంచ్ చంద్రిక

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో కాపు నేత స్వర్గీయ వంగవీటి మోహన రంగ 35వ వర్ధంతిని నిర్వహించారు. తొలుత రంగ విగ్రహానికి గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి రంగా చేసిన కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీ నార్ని రవికాంత నాగేశ్వరరావు (నాగులు), ఉండ్రాజవరపు రాజు, అడ్డాల గోపీకృష్ణ, పుల్లా అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

అత్తిలిలో ఘనంగా రంగా వర్ధంతి

అత్తిలి: బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు స్వర్గీయ వంగవీటి మోహనరంగా అందరికీ ఆదర్శప్రాయుడని యువనేత కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. రంగా వర్ధంతి సందర్భంగా అత్తిలి సంతమార్కెట్ సెంటర్‌లో ఉన్న రంగా విగ్రహానికి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు కూనపరెడ్డి జయరాజు, కందుల సత్యనారాయణ, సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు శింగంశెట్టి శ్రీనివాస్, మండల పార్టీ నాయకులు రంభ సూరిబాబు, కంకటాల సతీష్, గారపాటి నాగరాజు, ఆకుల చినబాబు, అడ్డాల వెంకటరత్నంబాబు, యడ్లపల్లి మణికంఠ పాల్గొన్నారు.

లోకానికి రక్షకుడు ఏసుక్రీస్తు



సూరంపూడిలో చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఇరగవరం: మండలంలో పలు గ్రామాల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ పండుగను ఉద్దేశించి మంత్రి కారుమూరి మాట్లాడారు. లోకానికి రక్షకుడు ఏసుక్రీస్తు అని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యులు పంపన అంజిబాబు, ఇరగవరం సర్పంచ్ కంకిపాటి శ్రీను, గోటేరు సర్పంచ్ జుత్తిగ గాయత్రి, రేలంగి గ్రామ సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, రేలంగి గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పులుపు అనిల్‌కుమార్, సూరంపూడి సర్పంచ్ చంద్రమణి వెంకటరామరాజు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అత్తిలి: ఏసుక్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించి తోటివారిపట్ల ప్రేమ, దయ కలిగిఉండాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం అత్తిలి మండలం గుమ్మంపాడు, స్కిన్నెరపురం, ఈడూరు, వరిఘేడు గ్రామాల్లో గల చర్చిలలో నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకల్లో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.